# బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం



ముప్కాల్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మెండోరా/మోర్తాడ్/ ముప్కాల్/ వేల్పూర్/ ఏర్గట్ల, నవంబర్ 25: బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారం మెండోరా మండలంలోని దూద్‌గాం, సోన్‌పేట్, మెండోరా, బుస్సాపూర్, పోచంపాడ్ గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ తలారి గంగాధర్ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు.

**మోర్తాడ్ కేంద్రంగా బీడీ కార్మికులకు పింఛన్**

మోర్తాడ్ మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఎంపీపీ శివలింగుశ్రీనివాస్, జడ్పీటీసీ బద్దంరవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. మోర్తాడ్ కేంద్రంగా బీడీకార్మికుల పింఛన్‌ను ప్రారంభించింది బీఆర్ఎస్ పార్టీయే నని, మంత్రి ప్రశాంత్‌రెడ్డి కోరిక మేరకు సీఎం కేసీఆర్ బీడీకార్మికులకు పింఛన్‌ను అందించారని తెలిపారు. కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరారు.

**నమూనా ఈవీఎంతో ఇంటింటి ప్రచారం..**

ముప్కాల్ మండలంలో నమూనా ఈవీఎంతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, సీనియర్ నాయకులు బద్దం నర్సారెడ్డి, సామ వెంకట్ రెడ్డి, మునీరుద్దీన్, కట్ట మహేశ్, కొమ్ముల మోహన్, మున్నా, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేల్పూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యుడు రేగుల్ల రాములు పాల్గొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఏర్గట్ల మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారం ఎంపీపీ కొలిప్యాక ఉపేంధర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గుల్లే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం ఇంటింటా ప్రచారం చేశారు. మంత్రి వేముల చేసిన అభివృద్ధి పనులు ఇండ్ల ముందర, కండ్లల్లో కన్పిస్తున్నాయని వివరించారు. వేములను మరోసారి దీవించాలని కోరారు.



వేల్పూర్ మండలం కొత్తపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మోర్తాడ్ మండలం దొన్కల్‌లో మహిళలను బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరుతున్న పార్టీ నాయకులు



ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్‌లో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు





ముప్కాల్, రెంజర్లలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## వేముల గెలవాలని కోరుతూ యువకుల పాదయాత్ర



బడాభీమ్‌గల్ నుంచి లింబాద్రిగుట్టకు బయల్దేరుతున్న యువకులు

భీమ్‌గల్, నవంబర్ 25 : బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గెలువాలని కోరుతూ మండలంలోని బడాభీమ్‌గల్‌కు చెందిన యువకులు, నాయకులు సుమారు 100 మంది శనివారం లింబాద్రిగుట్ట వరకు పాదయాత్రగా తరలివెళ్లారు. దారి పొడవునా ప్రశాంత్‌రెడ్డి జిం దాబాద్, కారు గుర్తుకు ఓటు వేయాలనే నినాదాలు చేశారు. శ్రీలక్ష్మీ నర్సింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేములకు మూడోసారి విజయం అందించి ఆశీర్వదించాలని వేడుకున్నారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు

ఏర్గట్ల, నవంబర్ 25 : మండలంలోని తాళ్ల రాంపూర్ గ్రామానికి చెందిన 20 మంది యువకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో మంత్రి వేముల చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులమై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు.

## ఘనంగా డోలోత్సవం

- వైభవంగా కొనసాగుతున్న నింబాచల బ్రహ్మోత్సవాలు
- నేడు లింబాద్రిగుట్టపై రథోత్సవం
- ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు





రథాన్ని ముస్తాబు చేస్తున్న ఆలయ సిబ్బంది

భీమ్‌గల్, నవంబర్ 25 : మండలంలోని లింబాద్రి గుట్టపై శ్రీలక్ష్మీ నృసింహుని బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సీతానగరిపై డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి ఆలయానికి పశ్చిమ వైపున ఉన్న జోడులింగముల మార్గమునకు వెళ్లే దారిలో ఉన్న సీతానగరంలోని నాలుగు స్తంభాల రాతి మండపంలో డోల సేవ నిర్వహించారు.

**నేడు స్వామివారి రథోత్సవం (జాతర)**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలు ఊరేగించే రథాన్ని అందంగా అలంకరిస్తున్నారు.

## పోచంపాడ్ గురుకులంలో ఎన్‌సీసీ దినోత్సవం



ఆలయం వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న విద్యార్థులు

మెండోరా, నవంబర్ 25 : మండలంలోని పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి శ్రీనివాస్‌తో కలిసి మొత్తం 113 మంది విద్యార్థులు పోచంపాడ్‌లోని అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రం చేశారు. అనంతరం గోదావరి నది తీరాన ఉన్న రామాల యం, శివాలయం పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు డు, జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్. తారాసింగ్, పీఈటీ సంజీవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలిక ఆత్మహత్య

బాల్కొండ, నవంబర్ 25: మండలంలోని కిసాన్‌గర్ గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న శివరాత్రి రిబిక (17) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గోపి తెలిపారు. బాలిక తల్లిదండ్రులు పదేండ్ల క్రితం మృతి చెందగా.. అప్పటి నుంచి పిన్ని వద్దే ఉంటున్నదని పేర్కొన్నారు. తల్లిదండ్రులను గుర్తుచేసుకుంటూ బాధ పడుతూ ఉండేదని, శుక్రవారం రాత్రి ఇంట్లో చీర సహాయంతో ఉరివేసుకొన్నట్లు ఎస్సై తెలిపారు. బాలిక పిన్ని లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.